# ఎదిరిస్తే ఎదురీతే

హేండ్‌బ్యాగ్ టేబిల్ మీద పెట్టి తిన్నగా బాత్‌రూమ్‌లోకి వెళ్ళి ముఖం కడుక్కుని వచ్చింది మాలతి. టైము ఆరు దాటింది. ఆకలేస్తోంది. పేపర్ చూస్తున్న భర్తని "టిఫిన్ తిన్నారా?" అని అడిగింది. "నేనూ, పిల్లలూ తినేసాం" అన్నాడు మోహన్ పేపర్ చూస్తూనే. వంటగదిలోకి వెళ్ళి వంటామె పెట్టిన చప్పగా చల్లారిన ఉప్మా తినేసి ఆకలి మంటని చల్లార్చుకుని హాల్లోకి వచ్చింది.

మాలతి మనస్సు ఈ రోజు గాలిలో తేలిపోతోంది. తన చిరకాల వాంఛ ఈనాటికి తీరింది. "అబ్బా! ఎప్పటినుంచో తను కన్నకలలు ఈనాటికి ఫలించాయి. బి.ఏ. పూర్తి చెయ్యగానే కొన్నాళ్ళు ఉద్యోగం చేస్తాననీ, పెళ్ళి వద్దని" పట్టుపట్టింది. మంచి సంబంధమని, తప్పిపోతే మళ్ళీ ఇలాంటిది రాకపోవచ్చని, కూతుర్ని ఒప్పించి పెళ్ళి చేసేశాడు తండ్రి. కాపరానికి వచ్చి పదేళ్ళయింది. ఇంటికి పెద్ద కోడలవడం ఇంట్లో మరిదీ, ఆడబిడ్డ, అత్తగారి మధ్య మసలవలసి రావడంతో, తన కోరిక కోరికగానే వుండిపోయింది. ఆ తరువాత ఇద్దరు పిల్లలు కూడా పుట్టడంతో సంసార బాధ్యతలు అధికమయి "అసలు తను ఈ జన్మలో ఉద్యోగం చెయ్యగలనా?" అని అనుకొని ఇక ఆ ఆలోచనని విరమించుకుంది.

ఈ పదేళ్ళలో అనేక మార్పులు వచ్చాయి. మరిది ఉద్యోగరీత్యా వేరే ఊరువెళ్తూ తల్లినికూడా తీసుకెళ్లేడు. ఆడబిడ్డ పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. పిల్లలు స్కూళ్ళకి వెళ్తున్నారు. ఉదయం పది గంటల కల్లా అంతా వెళ్ళిపోయి తను ఒంటరిగా వున్న సమయంలో తనలో ఇన్నేళ్ళుగా అణగివున్న కోరిక మళ్ళీ చిగురించసాగింది.

"ఇప్పుడు ఏ బాధ్యతలూలేవు. తను బి.ఏ. చదివింది వంటింట్లో వంట చెయ్యడానికేనా? నేనెందుకు ఉద్యోగం చెయ్యకూడదు? ఇంట్లో ఇలా కూర్చుని వృధాగా కాలం గడపకపోతే నాలు గొండలు సంపాదించుకుంటే తప్పేమిటి? వేడినీళ్ళకి చన్నీళ్ళు తోడన్నట్లు భర్తకి కొంత సహాయపడ్డట్టు వుంటుంది" అనుకుంది. మనస్సులో వున్న ఈ కోరికని ఒకరోజు భర్త దగ్గర వెల్లడి చేసింది. వినీ విననట్లు ఊరుకున్న భర్తని చూసి ఉక్రోషంతో వెళ్ళిపోయింది. కానీ పట్టు విడవని మాలతి రోజూ ఏదో ఒక టైములో భర్త దగ్గిర తనకి ఉద్యోగం చూసి పెట్టమని అడుగుతూనే వుంది. అంతే కాకుండా నెమ్మదిగా టైపు, షార్టుహేండ్ పరీక్షలకి కట్టి పాసయింది. ఇక భర్తనడిగి లాభం లేదనుకున్న మాలతి తన స్నేహితురాలి భర్త సహాయంతో టైపిస్టు వుద్యోగం సంపాదించుకుంది. భర్తతో ఈ విషయం చెప్పినప్పుడు మోహన్ కొంచెం ఆశ్చర్యంగానే ఆమెని చూసి, "మరి ఇల్లెవరు చూసుకుంటారు?" అన్నాడు.



కందుకూరి వెంకట మహాలక్ష్మి

"దానికేముందండీ! పనిమనిషి వుండనే వుంది, ఓ వంటలక్కని రాత్రిదాకా వుండేలా మాట్లాడాను, పిల్లల్ని చూసుకుంటుంది. మీరు వచ్చిన ఓ గంటకల్లా నేనూ వచ్చేస్తాగా!" అంది ఆనందంతో మాలతి.

మోహన్ తన ముఖంలో ఏ భావాన్నీ కనబరచలేదు.

మొదటి నెల జీతం అందుకున్న రోజున ఆమె ఆనందానికి అంతులేకపోయింది. "అబ్బా! ఎన్నాళ్ళుగా నాలో అణగివున్న కోరిక తీరింది! ఈ రోజుకోసం ఎంతగా ఎదురుచూసింది! నిజానికి తన భర్త జీతం అంతా తెచ్చి తన చేతిలోనే పోస్తారు. అయినా తన సొంత సంపాదన కష్టార్జితపు సొమ్ము తన్ని ఆనందంలో ముంచెత్తుతున్నట్లు, ఆ డబ్బు తనకీ ఆనందాన్ని కలిగించలేదు. మొదటి నెల జీతం ఏం చెయ్యాలి? భర్తకి మంచి పేంటూ షర్టూ కొనాలి, ఇంటికేదో మంచి సామాను కొనాలి, లేదా పిల్లలిద్దరికీ ఏదన్న కొనాలి, ముఖ్యంగా ఇవాళ అంతా కలసి సినిమాకి వెళ్ళి అక్కడినుంచి ఏ హోటల్‌కో వెళ్ళాలి" అనుకుంటూ ఆనందంతో భర్త దగ్గరికి వెళ్ళింది మాలతి, వెనకనుంచి వెళ్ళిన మాలతి మోహన్ కళ్ళుమూసి ఎడంచేతిలో వున్న ఆమె జీతాన్ని భర్త చేతిలో పెట్టింది. కళ్ళు తెరిచి చూసిన మోహన్ "ఇదేమిటి?" అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

"నా మొదటినెల జీతం. ముందు మనం బజారుకెళ్ళి మీకు పేంటూ, షర్టు, పిల్లలకి బట్టలూ - ఆ తరువాత పిక్చర్‌కీ, తరవాత హోటల్" అంది ఆనందంతో అతన్ని పెనవేసుకొంటూ.

"ఇవాళే తొందరేమొచ్చింది? అయినా నాకు బోల్డు బట్టలున్నాయిగా? నీపేర అకౌంట్ తెరుచుకుని ఆ డబ్బు బ్యాంకిలో వేసుకో" అన్నాడు మోహన్.

ఆ సమాధానంతో మాలతి ఉత్సాహమంతా చచ్చి, నీరుకారిపోయింది. నోటమాటరాక కూలబడిపోయింది.

తన భర్తకి తను వుద్యోగం చెయ్యడం ఇష్టంలేదు. అతని ఇష్టాఇష్టాలతో నిమిత్తం లేకుండా చేరింది. మొదట్లో ఇష్టపడకపోయినా నెమ్మదిగా అతనే సర్దుకుంటాడనుకుంది.

తమది మధ్యతరగతి కుటుంబం, భర్తకి వచ్చిన జీతం వచ్చినట్టే ఖర్చుయిపోతుంది. బ్యాంకిలో ఒక్కపైసాగానీ, వెనక ఆస్తిగానీ ఏం లేదు. అందుకే బి.ఏ. పాసయి ఇంట్లో వూరికే కూర్చోడం ఏమిటన్న దృష్టితో తను ఉద్యోగంలో చేరింది. ఈ విధంగా తన ముచ్చటా తీరుతుంది. కొంచెం డబ్బూ వెనకేసుకోవచ్చు అని అనుకుంది.

భర్త మాటలతో నిరుత్సాహపడిన మాలతికి ఉక్రోషం, ఉడుకుమోతుతనం వచ్చాయి. మరేం మాట్లాడకుండానే లోపలికి వెళ్ళిపోయింది.

సాయంకాలం ఆఫీసునుంచి వచ్చేసరికి హాల్లో పిల్లల్ని పట్టుకుని కొడుతున్న మోహన్‌ని చూసి గుమ్మం బయటే నిలబడిపోయింది. "ఇక మీ బ్రతుకులింతే వెధవల్లారా! ఇలాగే

చదువూ, సంధ్యా లేకుండా తగలడతారు. మీ అమ్మకి కావలసింది ఉద్యోగం, సొంత సంపాదన! మీరెలాపోతే ఏం? బి.ఏ. చదివానని వీధి ఎక్కకపోతే ఆ చదువేదో ఇంట్లో పిల్లలకి పాఠాలు చెప్పుకుంటూ సార్ధకం చేసుకోకూడదూ? గోళీకాయలూ, గోటీబిళ్ళలూ ఆడి వీధులమ్మట సంస్కారం లేకుండా మీరు తిరగండి! మీ అమ్మేమో తన బి.ఏ.ని సార్ధకం చేసుకుంటూ ఉద్యోగం చేస్తుంది. ఛి, ఛీ, ఇది ఇల్లుకాదు, నరకం" అంటూ కేకలేస్తున్నవాడల్లా మాలతిని చూసి విసురుగా లోపలికి వెళ్ళిపోయాడు.

కిష్కిందకాండలో వర్ణించినట్లుగా వుందా ఇల్లు, సోఫా మీద విడిచిన బట్టలు, హాల్లో ఓపక్క బూట్లూ, పుస్తకాలూ, పేపరు పేజీలు విడదీసి చిందరవందరగా పడివుంది. పిల్లలి స్కూలు బట్టలూ, పుస్తకాలు కొన్ని ఇటూ అటూ దొర్లుతున్నాయి. పది నిమిషాల్లో వాటి నన్నింటినీ వాటి వాటి స్థానాల్లో సర్ది, ముఖం కడుక్కోడానికి వెళ్ళిన మాలతి తిరిగి వచ్చేసరికి "అమ్మా మాకు హోమ్‌వర్కు చెప్పవా? నిన్న చెయ్యలేదని టీచర్లు కొట్టేరూ!" అంటూ వచ్చారు పిల్లలు. "కొంచెం ఆగండిరా!" అంటూ వంటింట్లోకి వెళ్ళి, మాలతి వంటామెను టిఫిన్ పెట్టమంది. "అమ్మా! ఇంట్లో సరుకులన్నీ అయిపోయాయి. ఏంలేక టిఫినేం చెయ్యలేదు. ఓసారి కాగితం తీసుకొస్తే ఏఏ సరుకులు కావాలో చెప్తాను, వ్రాసుకుందురు గాని" అంది. కరకరలాడుతూ వచ్చిన మాలతికి ఆమె మాటలు కారం జల్లినట్లయ్యాయి.

"నెలకి కావలసినవన్నీ నెల మొదట్లోనే తెచ్చిపెట్టేనుగా? ఇరవయ్యోతారీకు నాటికి అన్నీ అయిపోవడమేమిటి?" అంది.

"ఏమోనమ్మోయ్! నాకేం తెలీదు. నేనేం దొంగను కాను. ఇంటికేం పట్టుకుపోవటం లేదు. మీ ఎదురుగానే ఇంటికి పోతున్నాను. అనవసరంగా మీ ఇష్టం వచ్చినట్లు అనెయ్యడం కాదు. కష్టపడేవాళ్ళకి పది కొంపలుంటాయి. పొమ్మంటేపోతాంగానీ, మాటలు పడమండోయ్!" అంటూ తగాదాకు దిగింది తన లోకువ కనిపెట్టినట్లు.

తెల్లబోయిన మాలతి "సరే కాఫీ అయినా ఇవ్వండి" అంటూ గాస్‌స్టౌ వైపుకి చూసింది. ఎప్పుడు అంటించిందో ఫుల్‌లో మండుతోంది. "అలా అంటించి వదిలెయ్యకండి, కావాలంటే మళ్ళీ అంటించుకోవచ్చు, గాస్ దండగవుతుంది" అన్న మాటలకి "ఎసరేద్దామని వుంచానమ్మా" అంది సాగదీసుకుంటూ. వంటామె ఇచ్చిన కషాయం కాఫీ సేవించి పడకగదిలోకి దారితీసి మంచం మీద నడుం వాల్చింది మాలతి. అంతదాకా జరిగిన హంగామాను తల్చుకుంటూ సేద తీర్చుకోసాగింది.

"అమ్మా! అన్నయ్య చూడు నన్ను కొడుతున్నాడూ" అంటూ వచ్చిన పాపని చేరదీసి, ఇద్దర్నీ పిల్చి హోంవర్కు చేయించడానికి ఉపక్రమించింది. పాపకి పాఠాలు చెప్పి, బాబుకి లెఖ్ఖలు చెప్పడం ప్రారంభించింది. అవి ఐదవతరగతి లెఖ్ఖలు. బాబుకి అర్థమయ్యేలా తను చెప్పలేక పోతోంది. తమకాలం పద్ధతి వేరు - ఈ కాలం మోడర్న్ మేథమేటిక్సు అన్న పేరిట పాతవాటినే ముక్కుచుట్టు తిప్పి చెప్పి పిల్లల బుర్రల్ని వేడి ఎక్కించేస్తున్నారు. స్కూల్లో టీచర్లు

సరిగా చెప్పక, ఇంట్లో తను చెప్పలేక మధ్యలో పిల్లలు నలిగిపోతున్నారు. హోంవర్కు చెయ్యకపోతే ఇచ్చే పనిష్మెంట్లకి భయపడి, టీచర్లు చెప్పే పద్ధతీ, తను చెప్పే పద్ధతీ ఒకటి కాక సతమతమయ్యే పిల్లలు ఏం తోచక ఇంట్లో ఏడుస్తూ మర్నాడు స్కూలుకి వెళ్ళమని మారాం చేస్తూ వుంటారు. దీనికి ఒకటే పరిష్కారం అనుకుంది మాలతి.

"నాకా చెప్పడం రావటంలేదు. పైగా తీరుబడీ వుండటంలేదు. ఓ మంచి టీచర్ని చూసి ఇద్దరికీ ట్యూషన్ పెడితే నా సమస్యలు తీరిపోతాయి, భర్త ఇందాకా చదువు లేకుండా పిల్లలు పాడయిపోతున్నారని తిడుతున్నాడు కూడా" అనుకుంది. తన ఆలోచనకి తనే సంతోషిస్తూ పిల్లల్ని చదువుకోమని పంపేసింది.

మర్నాడు వెళ్ళి స్కూల్లో టీచర్నే వాళ్ళిద్దరి ట్యూషన్‌కి నూట యాభై రూపాయలకి మాట్లాడి కుదిర్చింది.

కాలం గడుస్తోంది. రోజూ ఇంటికొచ్చేసరికి ఇంట్లో ఏదో రభస జరుగుతూనే వుంది. ఏదో నెపంమీద భర్త తన్ని దెప్పుతూ చిరుబురులాడుతూనే వున్నారు. మోహన్‌లో వచ్చిన ఈ మార్పు ఆమెని చాలా బాధించింది. తనకంటే ముందు ఇంటికొచ్చే భర్త, పిల్లలకి వంటామె సరిగ్గా కాఫీ ఇవ్వలేదనో, టిఫిన్ లేదనో విసుక్కోని రోజులేదు. మొదట్లో సూటీపోటీగా చెప్పే మోహన్ రానురాను ముఖం మీదే విసుక్కోడం ప్రారంభించారు. "రోజల్లా చాకిరీచేసి, చచ్చి ఇంటికొచ్చే మొగుడికి కాఫీ ఇచ్చే దిక్కా సరైన టైముకి టిఫినా? ఎందుకీ వెధవ జీవితం, ఎందుకీ సంపాదన? సుఖంలేని సంసారం" అంటూ విసుక్కునేవాడు.

ఆ రోజు సాయంత్రం మాలతి ఇంటికొచ్చేసరికి భర్త వచ్చి నా స్నేహితులు నలుగురు టీకి వస్తున్నారని, త్వరగా ఓ స్వీటు, రెండు రకాల హాట్లూ చెయ్యమని పురమాయించాడు.

నిమిషం ఖాళీలేకుండా రోజల్లా ఆఫీసులో టైపు చేస్తూనే వుంది, ఇంటికొచ్చి కాస్త విశ్రాంతి తీసుకోవాలనుకుంది. కానీ ఇంటికొచ్చేసరికి భర్త ఆజ్ఞ శిరసావహించక తప్పదు. ఏ లోటు వచ్చినా ఇక తనపని అంతే. అయినా ఇంకో గంటలో స్వీటు, రెండు హాట్లూ ఎలా చెయ్యడం? మగవాళ్ళకి కొంచెం కూడా ఇంట్లో ఆడవాళ్ళ కష్టసుఖాల గురించి ఆలోచన వుండదు, తన సదుపాయం, తన విలాసాలు, ఏమాత్రం తనకి లోటు జరిగినా నరసింహావతార మెత్తుతారు. కనీసం స్వీటన్నా బజారునుంచి తెప్పించేస్తే, హాట్లు ఎలాగో చెయ్యవచ్చు అనుకుని పనిమనిషిని పిల్చి స్వీటు తెమ్మని డబ్బులిచ్చింది. వెనకనుంచి విన్న మోహన్ "మాలతీ! ఇంట్లోచేస్తే చెయ్యి, లేకపోతే మానెయ్యి, అంతేగానీ బజారు సరుకులు వద్దు! వాళ్ళు బజార్లో కొనుక్కోలేక నా ఇంటికి రావడం లేదు" అన్నాడు పనిమనిషి ఎదురుగానే. అవమానంతో మాలతి లోపలికి వెళ్ళిపోయింది. బజ్జీ, ఉప్మాచేసి, స్వీటు చెయ్యడానికి వుపక్రమించింది. ఇంతట్లోనే రావలసిన స్నేహితులు రానే వచ్చారు. మాలతి కాలూ చెయ్యీ ఆడటంలేదు. వంటామె ఆపనితో తనకేం నిమిత్తం లేనట్లు తన వంటపనే తను చూసుకో సాగింది. ఇంతలో భర్త లోపలికివచ్చి, మంచినీళ్ళు తెమ్మని ఆర్డరిచ్చి వెళ్ళేడు. తల అయినా దువ్వుకోలేదు.

నలిగిపోయిన చీర. ఇంటికొచ్చాక ముఖమయినా కడుక్కునే అవకాశం ఇవ్వకుండా భర్త జారీచేసిన ఆజ్ఞల్ని పాటించడంలోనే తనకి ఊపిరందటంలేదు. ఇంక చేసేది లేక చేతివేళ్ళతో జుట్టు సరిచేసుకుని, చీరకుచ్చెళ్ళు సర్దుకుని నాలుగు గ్లాసులు, జగ్గూ ట్రేలో పెట్టుకుని హాల్లోకి వెళ్ళింది. అందరికీ గ్లాసుల్లో నీళ్ళుపోసి ఇస్తున్న మాలతిని భర్త కోపంగా చూస్తూ, తన స్నేహితులకి పరిచయం చేశాడు. అందరికీ నమస్కారం చేసి లోపలికి వెళ్ళింది మాలతి. గబగబా స్వీటు పూర్తిచేసి వేడి, వేడిగా టిఫిన్లు ప్లేటులో సర్ది భర్తని పిల్చి అందిచ్చింది మాలతి. రుసరుసలాడుతూ భర్త వాటిని తీసుకుని వెళ్ళేడు.

స్నేహితుల్ని పంపేసి సరాసరి మాలతి దగ్గరికి వచ్చిన మోహన్ మాలతి మీదకి రయ్యిమని లేచిపోయాడు. "ఛీ-ఛీ-పాడు కొంపలా తయారయింది. హేమాహేమీ ఉద్యోగస్తులు, ఏదో సరదాకి టీకి రమ్మంటే వచ్చారు. మంచి గౌరవమే చేశావులే," అంటూ ఎగురుతున్న భర్త వైపు అర్థంకాక చూస్తూ "ఇంతకీ ఏంలోటు జరిగిందండీ" అంది అమాయకంగా.

"ఏం లోటు జరగలేదు. అసలు నాది బుద్ధితక్కువ. నీకు ఇంట్లో పన్లుచేసే తీరిక లేనప్పుడు స్నేహితులూ, సరదాలూ ఏమిటి? నాకు శాస్తి చెయ్యాలనే కదా చింపిరిజుట్టుతోటే, చీరయినా మార్చుకోకుండాను వాళ్ళ ముందుకి వచ్చావు? పైగా "తిండికొచ్చారు తినిపొండి" అన్నట్లు వాళ్ళ మొహాన్న టిఫిన్ పెట్టి పంపించావు. నా మర్యాద నిలబెట్టాలని లేదా? కాస్సేపు కూర్చుని కబుర్లు చెప్పి నువ్వుకూడా వాళ్ళతో టిఫిన్ తింటే పోయిందేమిటి? అయినా ఉద్యోగస్తురాలివిగా! నీకు ఇలాంటి వాటికి తీరికెక్కడలే?" అన్నాడు వెటకారంగా.

ఆఖరిమాటతో ఆత్మాభిమానం దెబ్బతిన్న మాలతికి కళ్ళంట నీళ్ళు తిరిగాయి. భర్తకేం సమాధానమివ్వకుండానే ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. ప్రక్కనే పొంచి వింటోన్న వంటామె మాలతిని చూసి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

మోహన్‌లో ఈ మార్పుతో పాటు తన డబ్బు విషయంలో కూడా చాలా మార్పు వచ్చింది. మొదట్లో "నీ జీతం బ్యాంకిలో వేసుకో, నీపేర అక్కౌంట్ తెరుచుకో" అన్న భర్త ఇప్పుడు తన జీతంలోంచి స్వతంత్రించి భర్తతో చెప్పకుండా ఏం కొన్నా, ఏం ఖర్చు చేసినా ఏదో వంకని దెప్పడం ప్రారంభించాడు. "నీ డబ్బుగా? నేనెవరిని? నీ సొంత సంపాదన నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో" అంటూ వెటకారంగా మాట్లాడేవాడు. నిజానికి తనదంటూ తను ఎప్పుడూ అనుకోలేదు. భర్త జీతం ఇచ్చినప్పుడు ఖర్చు పెట్టినట్లే, తనదీ, అతనిదీ కలిపి ఖర్చుచేసి కొంత నిలవ వెయ్యాలన్నదే మాలతి ఉద్దేశ్యం. కానీ భర్త దాన్ని అపార్థం చేసుకుని, నిందించడంతో తన జీతంకూడా తెచ్చి మోహన్ జీతం పెట్టేచోటే పెట్టేసేది. మొదట్లో వద్దు, వద్దనే భర్త నెమ్మదిగా అంతా విరివిగా ఖర్చు చెయ్యడం ప్రారంభించాడు. "డబ్బు ఏదీ? ఏం చేశా"రని తనెప్పుడూ అడగలేదు. అడిగితే వచ్చే సమాధానం తెలుసు. వీలయినంత వరకూ గొడవలు రాకుండా చూసుకోవాలని ప్రయత్నించేది. అయినా ఆఫీసునుంచి ఇంటికి వచ్చే టైముకో, రాగానేనో ఇంట్లో రగడ జరగడం మాలతికి పరిపాటయి పోయింది. షికారుకి రమ్మనే భర్తకి

ఏం ఆటంకం చెప్పినా తన ఉద్యోగాన్నే నిందిస్తూ దెప్పుతాడు. అంతేగానీ ఏ మాత్రం తనని అర్థం చేసుకోడానికి ప్రయత్నించేవాడు కాదు. రోజల్లా ఆఫీసులో పనిచేసి వచ్చే మాలతికి ఇంట్లో చాకిరీ తప్పేది కాదు. వంటామె అన్నీ సరిగ్గా చేస్తోందో లేదో చూసుకుంటూ, భర్తకేం లోటొస్తుందో అని గాభరాపడుతూ ఆఫీసుకి వెళ్ళడం కష్టమే అయ్యేది. అందులోనూ ఆమెది ప్రయివేటు కంపెనీ అవడంవల్ల తను సరిగ్గా వేళకు వెళ్ళవలసి వచ్చేది. ఇంట్లో తొమ్మిది గంటలకన్నా బయలుదేరితేగానీ ఆఫీసుకి చేరలేకపోయేది. ఇంట్లో వంటామెకి అన్నీ చెప్పి పిల్లల్ని స్కూళ్ళకి పంపి భర్తకి అన్నీ అమర్చి, నాలుగు మెతుకులు తిని ఆఫీసుకు బయలుదేరే టైముకి గడియారం ముల్లు తొమ్మిదిన్నర దరిదాపులకే వచ్చివుండేది. ఆదరాబాదరాగా బయలుదేరి తనకి బస్సు అందక ఆటోరిక్షా ఎక్కక తప్పేది కాదు. రూపాయిన్నర ఇచ్చి ఆఫీసుకి వెళ్ళినా రోజూ అరగంట లేటే అయ్యేది. అప్పటికే తలములగని కాగితాలు బల్లమీద రెడీగా వుండేవి. వంచిన తల ఎత్తకుండా సాయంత్రం ఆరుగంటలదాకా టైపు చేసినా తరిగేవి కావా కాగితాలు. ఆఫీసులో పనంతా పూర్తిచేసి ఇంటికొచ్చేసరికి ఇంటిదగ్గర రోజూ ఏదో గొడవతో ఇంట్లో మనస్థిమితం లేకుండా పోయేది. అటు చేజేతులారా ఉద్యోగాన్ని వదులుకోలేక, ఇటు ఇంట్లో రోజూ భర్తచేత విసుగుదెప్పులూ పడలేక సతమతమయ్యేది. భార్యా, భర్తల మధ్య ఆప్యాయతా, అనురాగాలకి బదులుగా చిరాకు విసుగు ఎక్కువయ్యాయి. "భర్త ఇష్టప్రకారం అన్నీ జరుగుతుంటే, ఏ విషయంలోనూ ఎదిరించకుండా, అన్నీ సమ్మతించి చేస్తూంటే సంసారం సాఫీగా నడుస్తుంది. అతని ఇష్టాన్ని వ్యతిరేకించి, ఏ పనిచేసినా అతనికి తను చేసిన పనిలో ఇబ్బందులూ, నష్టాలే కనబడతాయనుకుంటా; స్వాతంత్ర్యం, స్వేచ్ఛా లేని జీవితం" అనుకుంది మాలతి.

అత్తగారు వస్తున్నట్లు వ్రాసిన వుత్తరం మాలతికి ఎంతో సంతోషాన్ని కలిగించింది. అత్తగారి ఇంటికి వచ్చాక ఆమెకీ తనకి మధ్య ఏవిధమైన పొరపొచ్చాలూ లేవనే చెప్పాలి. అందుకు ఇటువంటి తరుణంలో అత్తగారు వస్తే ఇంట్లో ఆడదిక్కు వుండడమే కాకుండా ఇంట్లో భర్త విసుగులూ, గొడవలూ తగ్గుతాయి.

"కొందరు మగవాళ్ళ మనస్తత్వాలు వింతగా వుంటాయి. భార్య ఉద్యోగస్తురాలయి, డబ్బు సంపాదిస్తున్నా, వాళ్ళని తమతో సమానంగా చూసుకోలేరు. మగవాణ్ణి కష్టపడి వస్తున్నాను ఇంట్లో ఏలోటూ లేకుండా అన్నీ అమరాలన్నదే వారి ఉద్దేశం. స్త్రీలు ఎంతో ముందంజవేసి పురుషులతో సమానులమని నిరూపించుకున్నా, పురుషులు ఒకమెట్టు క్రిందకి దిగి స్త్రీల కష్టసుఖాలలో పాలుపంచుకోరు. వారితో సహకరించాలని అనుకోరు. భార్య అన్న పదానికి అర్థం అనాదిగా వచ్చే వంటింటి కుందేలన్నదే. పిల్లల్ని కనే యంత్రం. వారిని పెంచి, పెద్దచేసి, సంసారం చక్కదిద్ది, ఇంటిపన్లు చెయ్యడం వారి హక్కు. అది మగవాళ్ళు చేస్తే లోకం నవ్వుతుంది. అది ఆడవాళ్ళకే చెందవలసిన సొత్తు అన్న భావాలు వారిలో నాటుకుపోయాయి. పెళ్ళికి ముందు స్త్రీల హక్కుల గురించి, అభ్యుదయ భావాల గురించి లెక్చర్లు ఇస్తారు. ఇంట్లో

మళ్ళీ తన భార్య అనేసరికి భర్త, పిల్లలూ, సంసారం అంటూ వుండవలసిందే. తనకంటూ ఓ గ్లాసు నీళ్ళు తీసుకుని తాగరు. ఇదీ ఇంట్లో ఆడదానిపట్ల కొందరి మగవారి అభ్యుదయ భావాలు. మాటల్లోనే తప్ప చేతల్లో ఎదగలేని వ్యక్తులు" అనుకుంది.

అత్తగారు వచ్చిన తరువాత మాలతికి ఎంతో సంతోషంగా వుంది. వచ్చిన మర్నాడు అత్తగారు ఇంట్లోపనన్నీ చక్కబెట్టుకుంటుంటే మొదటిసారిగా మాలతి ఆఫీసుటైము కంటే పావుగంట ముందే ఆఫీసుకి వెళ్ళగలిగింది.

రోజులు గడుస్తున్నాయి. ఇంట్లో అత్తగారి హయాంలో వంటామె, పనిమనిషి పన్లు చేస్తున్నారు. పిల్లల ట్యూషన్‌కి టీచర్ వుంది. ఇంక ఏ గొడవలూ, చిరాకులూ లేకుండా హాయిగా ఉద్యోగం చేసుకోవచ్చని మాలతి ఆశించింది.

"మాలతీ! వంటలక్క మధ్యాహ్నం తన కూతురికి ఇంట్లో ఎండుమిరపకాయలూ, చింతపండు అందిచ్చి పంపుతోంటే నాకళ్ళ పడిందే. "ఏమిట"ని అడిగితే కంగారుపడి క్రింద పడేసింది. ఇలా ఎన్నాళ్ళుగా జరుగుతోందో? ఇద్దరూ బైటికి వెళ్ళిపోయారు. ఎన్ని సామాన్లు ఇలా దోచేస్తోందో! అయినా యాభైరూపాయల జీతం ఇస్తూ రెండు పూటలా భోజనం, కాఫీ, టిఫిన్లతో దానికి నెలకి ఇంకో వందరూపాయలన్నా ఖర్చుఅవటం లేదా? ఎందుకి అనవసరపు ఖర్చు? దానికోసం నూటయాభైరూపాయలు ఖర్చు దండగ కదూ?" అంటూ ఆఫీసునుంచి వచ్చిన మాలతితో మోహన్ ఎదురుగా ఫిర్యాదు చెయ్యసాగింది అత్తగారు.

"నేను చెప్పలేదమ్మా! నీ కోడలు గడించేది అయిదొందలు, అందులో నూటయాభై వంటామెకు, నూటయాభై పిల్లల ట్యూషన్‌కి, పనిమనిషి ప్రమోషన్ ఇచ్చింది, తన బస్సులకి వగైరాలకో వందరూపాయలు, మిగిలింది మరి ఉద్యోగస్తురాలుగా? సామాన్య స్త్రీలలా కాక కాస్త టిప్‌టాప్‌గా వుండాలిగా? అందుకు బట్టలకీ వగైరాలకీ. "నీ భార్య ఉద్యోగస్తురాలుగా నీకేమోయ్! ఇద్దరూ సంపాదిస్తున్నారు. ఎంత నిలవ్వేస్తున్నారేమిటి?" అని వెటకారమాడే స్నేహితులకి జవాబు చెప్పుకోలేక, లేనిపోజుకొట్టి, ఏడ్వలేక నవ్వుతున్నాను. ఇదమ్మా! నీ కోడలి ఉద్యోగం" అన్న మోహన్ మాటలు కొరడాతో వెన్నుమీద కొట్టినట్లయి, ఏం జవాబు చెప్పలేక, అత్తగారిని, భర్తనీ ఓసారిచూసి తలొంచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

"భర్తని ఎదిరించి ఉద్యోగం చేసిన ఆడదానికి ఇచ్చే విలువ ఇంతేనేమో! అదే భర్తకి ఇష్టమయి ఉద్యోగం చేసే భార్యలకి భర్తలు ఎన్నో విషయాల్లో సహాయపడి ఇప్పుడు లెక్కచెప్పిన ఖర్చులలో కొన్నింటిని తగ్గించుకోవటం లేదూ?" అనుకుంది. కానీ పైకి అనలేకపోయింది.

మర్నాడు వంటామె పనిలోకి రాలేదు. అత్తగారు మాలతి దగ్గరకివచ్చి "ఉదయం పన్లు, వంట నేను చూసుకుంటాను సాయంత్రం నువ్వు వచ్చాకా ఇద్దరం చేసుకోవచ్చులే మాలతి! ఎందుకా వంటలక్క!" అన్న మాటలకి "సరే" అని తలూపింది. కానీ వంటామె మానేసిన దగ్గరనుంచీ మాలతి మరీ నలిగిపోసాగింది. వంటామెమీద అధికారం చెలాయించి పన్లుచెప్పి,

చేయించుకున్నట్లు అత్తగారిని అడిగే స్వాతంత్ర్యం తనకిలేదు. ఆమె అత్తగారు, తను కోడలు, ఒకవేళ ఆమె చేసినా నరాలు ఎవరో పిండుతున్నట్లుండేది. దాంతో ఆఫీసుకి వెళ్ళేవరకూ అత్తగారి వెనక అన్నీ చెయ్యవలసి వచ్చేది. వంటామె వున్నప్పుడు ఆమెకి చెప్పేవి నాలుగూ చెప్పేసి, భర్త, పిల్లల పన్లు మాత్రమే చేసుకునేది. ఇప్పుడు కూరతరగడం, అన్నం వడ్డించడం లాంటి పైపన్లన్నీ చెయ్యవలసి వచ్చేది. నెమ్మది నెమ్మదిగా అత్తగారు ఏ జపంలోనో కూర్చుని మాలతిని వంటకూడా చూసుకోమనడం ప్రారంభమయింది. ఆఖరికి రెండుపూట్లా వంటా, చాకిరీచేసి ఆఫీసుకి వెళ్ళవలసి వచ్చేది. ఇంతచేసినా దెప్పిపొట్లూ, వెటకారాలూ తప్పేవికావు. దాంతో ఉద్యోగంలోవున్న మజాకంటే కష్టాలే ఎక్కువగా ఎదురయ్యాయి. వీటన్నింటితో విసిగిపోయిన మాలతి ఉద్యోగం చెయ్యనప్పటి జీవితంతో ఇప్పటి జీవితాన్ని పోల్చుకుని దిగులు చెందని రోజు వుండేదికాదు. అత్తగారిలో కూడా మార్పు వచ్చేసింది. పెళ్ళయిన కొత్తలో వున్న ఆప్యాయత ఆదరణా ఆమెలో లేదు. మనుష్యులు ఎప్పుడెలా మారిపోతారో తెలుసుకోడం కష్టం" అనుకునేది.

"పెద్దదాన్నయిపోయాను. కొడుకు కోడళ్ళ పంచన రామా కృష్ణా అనుకోవలసిన ఈ రోజుల్లో నాకు ఇంకా ఇంటి బాధ్యత, చాకిరీ తప్పటం లేదమ్మా!" అంటూ పక్కింటి ఆమెతో అంటున్న మాటల్ని అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన మాలతి విని నిశ్చేష్టురాలయి నిలబడి పోయింది. "ఎందుకు ఒక మనిషి నూటయాభైరూపాయల ఖర్చు, నేనున్నాగా? అన్న అత్తగారేనా ఈ మాటలు అంటుంట?" అని నివ్వెరపోయింది. ఎంతగా మారిపోయింది ఈమె. అత్తగారన్న గౌరవంలో ఆమె వెనక చెయ్యటంలేదా? మరి ఏమిటి నిష్టూరాలు ఇటునుంచి అటుకాలుకదపని భర్తకి అన్నీ అందించాలి. ఏది మర్చిపోయినా "రోజల్లా కష్టపడేది తిండికోసమే, ఇంట్లో పెళ్ళాం వున్నా ఆమె ఉద్యోగస్తురాలు, ఇంక ఆమెకే ఎదురు చెయ్యాలి. నాకెవరు చేస్తారు? కొందరి జాతకాలంతే" అంటూ దండకం ప్రారంభిస్తాడు. ఆ సణుగుడు విని ఎప్పుడు అగ్నికి ఆజ్యం పోద్దామా? అని ఎదురుచూసే అత్తగారు, ఇది మంచి అదునుగా తీసుకుని "ఏం కావాలిరా? నేనిస్తానుండు" అంటూ వెళ్ళడం - దాంతో అతని దండకం రామాయణంగా మారి, తల్లి మీద సానుభూతి కనపరుస్తూ "ఎందుకమ్మా నీకాశ్రమ, పెద్దదానివి నీకు చెయ్యవలసింది పోయి నీచేత చేయించుకోడమా" అంటూ ప్రారంభిస్తాడు భర్త. ఇల్లు నరకంలా తయారయింది మాలతికి. ఆ రాత్రల్లా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చింది. తేలికైన మనస్సుతో తెల్లారి లేచి యధాప్రకారంగా పన్లు ముగించుకుని ఆఫీసుకి వెళ్ళింది.

సాయంత్రం ఎంతో సంతోషంగా ఇంటికి తిరిగి వచ్చింది. "మళ్ళీ నా జీవితం పెళ్ళయిన మొదట్లో వున్నట్లే వుంటుంది. ఇంక నాకు గొడవలూ, చికాకులు వుండవు. పిల్లలతో, అత్తగారితో, భర్తతో హాయిగా నా జీవితాన్ని సాగించాలి, కోరి కష్టాలను ఎందుకు తెచ్చుకోవాలి. నిజానికి ఇదంతా చేజేతులారా కొనితెచ్చుకున్నదే. ఇంక ఉద్యోగం మీద మోజు

పోయింది, ముఖ్యంగా ఇంట్లోవారి సానుభూతి అండ లేనిదే ఆడది ఏ పనిచేసినా అది నరకప్రాయం, ఏటికి ఎదురీత అవుతుంది. అందుకు నే తీసుకున్న నిర్ణయం సమంజసంగానే వుంది." స్నేహితురాలితో తన కష్టాలన్ని చెప్పి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేసినట్లు చెప్పి తేలికైన మనస్సుతో ఇంటికొచ్చింది. రేపు ఉదయం ఆఫీసుకి వెళ్ళకపోవడంతో భర్త తెల్లబోతాడు తను రాజీనామా గురించి చెప్పగానే అనుకుంది.

"ఇవాళ మీ ఆఫీసుకి శలవా?" అన్నాడు మోహన్ సావకాశంగా ఇంటిపన్లు చేసుకుంటున్న మాలతితో.

"లేదు" అంది ముక్తసరిగా.

"మరి ఇంకా కూర్చున్నారేం రాణీగారు? ఈపాటికి పరుగులెట్టేవారుగా?" అన్నాడు వెటకారపు నవ్వుతో.

"ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేశాను" అంది ముక్తసరిగా.

"ఎందుకిచ్చావు? మాటమాత్రమైనా నాతో చెప్పనక్కరలేదా? ప్రతిదానికి నీకు నువ్వే పెద్దదానివా? ఇంట్లో మొగుడు అనేవాడు ఉన్నాడని అనిపించదా? అటు నేను బ్యాంకిలో నెలకి వందరూపాయలు రికరింగ్ డిపాజిట్ అక్కౌంట్ తెరిచాను పైగా ఇంటి స్థలం కొందామని లోన్‌కి అప్లై చేశాను. ప్రతినెలా నాజీతంలో ఆ డబ్బు కట్‌చేస్తారు. అందుకని నువ్వు ఉద్యోగం మానటానికి వీల్లేదు. వెళ్ళి రాజీనామా విత్‌డ్రా చేసుకున్నానని మీ మేనేజర్‌కి చెప్పు. నేను కూడా ఫోన్ చేస్తాను" అని చరచరా అక్కడనుంచి వెళ్ళిపోయే భర్తవైపు అవాక్కయిపోయి చూస్తూ నిలబడింది మాలతి.

**- ప్రభవ, అక్టోబర్ 1980**